క్లుప్తంగా

తెనాలిలో అర్బన్ మార్కెట్ ప్రారంభం



తెనాలిఅర్బన్: మెప్మా ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన వస్తువులను విక్రయించుకునేందుకు దీనిని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి మూడు నెలలకు రెండు రోజుల చొప్పున మార్కెట్‌ను ఏర్పాటు చేస్తారని చెప్పారు. అందరూ వీటిని కొనుగోలు చేయాలని కోరారు. ఆమె వెంట మెప్మా తెనాలి సిటీ మేనేజర్‌లు మాధవరావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ



తెనాలిఅర్బన్: ఫీడ్ మై పీపుల్ సంస్థ నిర్వాహకులు బిషపు గద్దం సాధు థామస్ జూనియర్, మేరిగ్రేస్ థామస్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు శుక్రవారం ఐదు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చొప్పర నాగేంద్రం, వారిన్‌బాబు, పీటర్, చొప్పర డానియేల్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మలేరియా మాసోత్సవాలు



తెనాలిఅర్బన్: మలేరియా సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా తెనాలి సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీని పట్టణంలోని 45, 46, 47 సచివాలయాల పరిధిలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, విషజ్వరాలు వస్తాయని చెప్పారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, ఆది ఆంధ్ర ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కీర్తన ఏంజల్, ఆరోగ్య పర్యవేక్షకులు దాసరి మల్లేశ్వరరావు, టి.మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

మున్నంగి(కొల్లిపర): మండలంలోని మున్నంగి గ్రామంలో శుక్రవారం గుర్తు తెలియని బైక్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మున్నంగి గ్రామానికి చెందిన రావూరి సుబ్బారావు(52) ఉపాధి హామీ పథకం ద్వారా కూలి పనులకు వెళ్లి తిరిగి గ్రామానికి తన సైకిల్‌పై వస్తుండగా గుర్తుతెలియని బైక్ ఢీకొనడం వలన వెంటనే రోడ్డు పక్కన పడి మృతి చెందాడు. మృతుడి భార్య రావూరి కుమారి ఫిర్యాదు మేరకు రైటర్ శ్యామ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికి ప్రచారం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

తెనాలిటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ కోరారు. పట్టణంలోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో బీజేపీ సీనియర్ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ కె.నీలకంఠ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మంచాల రత్నరాజు, కొల్లిపర మండల అధ్యక్షులు మునగాల కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి కృష్ణకాంత్, మైలా హరికృష్ణ, అనుంతాచార్యులు, గాన కళావతి, బిట్రా కనకదుర్గ, మణికంఠ, ఆదిత్య, రామకృష్ణ, ప్రవీణ్, నరేంద్ర, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించరా?



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్



వార్డులలోని సమస్యలపై ఏకరువు పెడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు

- అధికారులపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌ల ఆగ్రహం
- ఏఈ రాజును వెంటనే బదిలీ చేయాలని చైర్‌పర్సన్ ఆదేశం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని పలు వార్డులలో అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారు...ఇలా అయితే మేము ఏవిధంగా ప్రజలకు సమాధానం చెప్పాలంటూ పలువురు వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం అయిన కొద్ది నిమిషాలకు టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ లేచి చెంచుపేట లింగారావు రోడ్డులో కాల్వలు పాడై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిపాదనలు ఇచ్చి సుమారు 22 నెలలు దాటినా ఇప్పటి వరకు వాటిని నిర్మించలేదని అన్నారు. అలాగే తన వార్డులో సామూహిక మరుగుదొడ్లు సగం నిర్మించి వదిలేశారని, వాటిని పూర్తి చేయాలని కోరారు. నెలలోపు వాటిని పూర్తి చేయిస్తానని చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ హామీ ఇచ్చారు. కాల్వలు వచ్చే నెలలో అజెండాలో పొందుపరిచే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. టీడీపీ కౌన్సిలర్‌లు కొత్రపాటి లక్ష్మి, పసుపులేటి త్రిమూర్తిలు సింగిల్ టెండర్లు ఎందుకు అనుమతి ఇస్తున్నారని ప్రశ్నించారు. ఆన్‌లైన్ ద్వారా టెండర్లు పిలవటం జరుగుతుందని, దానిలో ఎవరైనా పాల్గొనవచ్చని ఎంఈ నాగమల్లేశ్వరరావు తెలిపారు. సింగిల్ టెండర్లు రావటం వల్ల వాటిని కౌన్సిల్ ముందుకు తేవటం జరిగిందన్నారు. మీరు ఆమోదిస్తే వర్క్ ఆర్డర్ ఇచ్చి పనులు చేయిస్తామని చెప్పారు. సింగిల్ టెండర్ వస్తే దానిని రద్దు చేసి రెండో టెండర్ పిలవవచ్చుగా అని త్రిమూర్తి ప్రశ్నించారు. అలా పిలిచే అధికారం తమకు లేదని ఎంఈ చెప్పారు. త్రిమూర్తి దానిపై వితండవాదం చేస్తుండటంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డిలు జోక్యం చేసుకుని అధికారులు అంత వివరంగా చెబుతున్నా ఎందుకు అలా ప్రవర్తిస్తున్నారని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని వారిని వారించి అజెండా చదివించారు. మారీసుపేటలో కల్వర్టు నిర్మాణానికి ఎందుకు అంత ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఏఈ రాజు ఎక్కడని చైర్‌పర్సన్ ప్రశ్నించారు. అతడు సెలవులో ఉన్నాడని డీఈ చెప్పటంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలలో ఒక్కసారి జరిగే సమావేశానికి ఆయన ఎందుకు రావటం లేదని ప్రశ్నించారు. అతని వల్లే పనులలో జాప్యం జరుగుతుందని వెంటనే అతడిని తెనాలి నుంచి పంపాలని కమిషనర్‌ను ఆదేశించారు. చంద్రబాబు నాయుడు కాలనీలోని రాజీవ్ గృహకల్పలో డ్రెయినేజీ వ్యవస్థ పాడైందని, వెంటనే దానిని తొలగించి కొత్తది నిర్మించాలని 23, 24 వార్డుల కౌన్సిలర్‌లు తోక శిరీష, పెదలంక లక్ష్మీలావణ్యలు కోరారు. నెలలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు గుంటూరు కోటేశ్వరరావు, ఆవుల కోటయ్య, టీడీపీ కౌన్సిలర్ బ్రహ్మేశ్వరరావులు వార్డులోని సమస్యలు ప్రస్తావించారు. అనంతరం అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంప్‌లు

- ప్రజలకు అవరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పంపిణీ
- సద్వినియోగం చేసుకోవాలన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ఆరంభించిన జగనన్న సురక్షలో కీలకమైన ఘట్టం శనివారం నుంచి ఆరంభం కానుంది. నియోజకవర్గంలో పట్టణం, మండలాల్లో రెండేసి చొప్పున శిబిరాలను నిర్వహించనున్నారు. ప్రజలకు అవసరమైన తొమ్మిది రకాల ధ్రువీకరణ పత్రాలను అక్కడికక్కడే అందించనున్నారు. వినూత్నమైన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఏవైతే హామీలనిచ్చారో వాటిలో 98 శాతం చిత్తశుద్ధితో అమలుచేసినట్టు ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. సంక్షేమ పథకాలు అందక ఎక్కడైనా ప్రజలు ఇబ్బంది పడుతున్నారేమో తెలుసుకునేందుకు పదినెలలుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము ఇంటింటికి తిరుగుతున్నట్టు చెప్పారు. సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే అవి కూడా ఉచితంగా స్పాట్‌లో ఇచ్చేందుకని ఇప్పుడు జగనన్న సురక్ష పేరుతో ప్రజల ముందుకు వెళుతున్నట్టు తెలిపారు. వారం రోజులుగా వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి, ఆయా ఇళ్లలోని కుటుంబసభ్యుల అవసరాలను నమోదు చేసుకుని టోకెన్లు ఇచ్చినట్టు ఎమ్మెల్యే చెప్పారు. శనివారం నుంచి రోజుకు పట్టణంలో రెండు సచివాలయాల్లో, రెండు మండలాల్లోనూ రెండేసి చొప్పున శిబిరాలు జరుగుతాయని చెప్పారు. వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లతోపాటు పార్టీ కౌన్సిలర్లు, పార్టీ క్యాడర్‌తో పాటు తాను, మున్సిపల్ చైర్‌పర్సన్ కూడా శిబిరాలను పర్యవేక్షిస్తామని చెప్పారు. అవసరమైన తొమ్మిది రకాల సర్టిఫికెట్లలను స్పాట్‌లో ఉచితంగా ప్రజలకు అందజేస్తామని తెలిపారు. జులై 23వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో కార్యక్రమ కన్వీనర్లు తాడిబోయిన రామయ్య, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, షరీఫ్‌లు మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి అవసరమైన శిక్షణ పూర్తయిందన్నారు. పార్టీ నాయకులు బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, షేక్ మీరావలి, సిరికృష్ణ, కుర్రా జస్వంత్, కొండారెడ్డి పాల్గొన్నారు.

2న 'ఆహార వైద్యం' పుస్తకావిష్కరణ

తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంకు మేనేజరు సాయి లక్కరాజు తాజా రచన 'ఆహార వైద్యం' పుస్తకావిష్కరణ జులై 2వ తేదీన జరగనుంది. విజయవాడకు చెందిన సాహితీ ప్రచురణలు ముద్రించిన ఈ పుస్తకాన్ని ఆ రోజు ఉదయం 10.30 గంటలకు స్థానిక ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆవిష్కరిస్తారు. 'గృహమే వైద్యశాల...వంటింట్లో వస్తువులే మందులు'గా పేర్కొంటూ 'ఆహార వైద్యం' పుస్తక రచన చేశారు. ఎవరికివారు ఇంట్లోనే గృహవైద్యంతో రోగ నిరోధకతను పెంచుకుని పలు వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చనే సాయి భావన. మొత్తం 224 రోగాలకు దినుసులతో ఎలా నయం చేసుకోవచ్చునో ఇందులో సరళమైన భాషలో వివరించారు. 1990లో పాండిచ్చేరిలో హోమియో వైద్యవిద్యను అభ్యసించటం ఉపకరించిందని సాయి చెప్పారు. మన వంటింట్లోని దినుసులను సరైన విధానంలో వాడటం ద్వారా అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవచ్చని వివరించారు.

రూ.ఆరు కోట్లతో నందివెలుగులో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే శివకుమార్



లబ్ధిదారునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: నందివెలుగులో రూ.ఆరుకోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం నందివెలుగులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నాలుగోరోజు నిర్వహించారు. అధికారులు, వాలంటీర్లు, సచివాలయ, పంచాయతీ సిబ్బందితో ఎమ్మెల్యే కలసి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి అడుగుతున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్నాలను అమలు చేస్తున్నామన్నారు. జవాబుదారీతనంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో 994 మందికి పింఛన్‌లు పంపిణీ, 232 మందికి కాపునేస్తం 178 మంది వైఎస్సార్ చేయూత అందిస్తున్నామని, ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్, ఎంపీటీసీ షేక్ సిలార్ జానీ, సొసైటీ చైర్మన్ తోట కూర వసంతరావు, మాజీ చైర్మన్ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, శివాలయం చైర్మన్ తన్నీరు వెంకటేశ్వరరావు, వేముల మహేష్, బెజ్జం బాజీ, ఉపసర్పంచ్ శివనాగేశ్వరరావు, కసుకుర్తి దానియేలు, చీదర్ల శాంతిరాజు, బొంతు నరేంద్రరెడ్డి, విజయలక్ష్మి, వీఆర్వోలు కృష్ణమూర్తి, లక్ష్మీ, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు అందుకున్న విద్యార్థినులతో ఎంఈఓ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ సురేంద్ర

తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ ఒకటో వార్డు కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సహకారంతో అయితానగర్ ఎన్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌లోని విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తేలప్రోలు, కొలవరం, నేలపాడు తదితర గ్రామాల నుంచి విద్యార్థినులు అయితానగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌కు చదువుకునే నిమిత్తం వస్తున్నారని తెలిపారు. వారి రవాణా ఇబ్బందులు తొలగించేందుకు కౌన్సిలర్ సురేంద్ర చొరవ తీసుకుని లయన్స్ క్లబ్ ప్రతినిధులతో మాట్లాడి సైకిళ్లు పంపిణీ చేసే విధంగా చూశారన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, హరనాథ్, శర్మ, ప్రసూనాదేవి, బాలమ్మ, శ్రీను, వాసు, విద్యా కమిటీ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధించగలుగుతారు

ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు



కొలకలూరులోని ఆర్.హెచ్.స్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న రాయుడు

తెనాలిటౌన్: ఆత్మ విశ్వాసంతో ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలుగుతామని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు విద్యార్థులకు సూచించారు. క్రీడలు పట్ల ఆసక్తి కలిగి ఉండాలని, చిన్నప్పటి నుంచి చదువుతో ముందంజలో ఉండాలన్నారు. రూరల్ మండలం కొలకలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో క్రికెటర్ రాయుడు పాల్గొన్నారు. స్కూల్‌కు వచ్చిన రాయుడుకు హెచ్‌ఎం నాగేశ్వరరావు, కమిటీ చైర్మన్ పినపాటి అనిల్, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో రాయుడు మాట్లాడుతూ ఓటమి చెందినప్పుడు నిరాశపడవద్దని, లక్ష్యాన్ని గుర్తు చేసుకుంటూ మళ్లీ పోరాటం చేయాలన్నారు. ఏడు నుంచి 14 సంవత్సరాల వరకు తమ తండ్రి గ్రౌండ్‌కు తీసుకెళ్లి క్రికెట్ పట్ల ఆసక్తి పెంచారని తెలిపారు. క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. విద్యార్థులకు ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. విద్యార్థులతో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కాలిశెట్టి ఫణికుమార్, వీరమల్లు కార్తికేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌హెచ్ స్కూల్ గ్రౌండ్‌లో కొద్దిసేపు నాయుడు యువకులతో కలసి క్రికెట్ ఆడారు. ఫొటోలు దిగారు. అక్కడ ఎమ్మెల్యే పీఏ సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్, కార్తికేయ, ఫణికుమార్‌లు రాయుడును సత్కరించారు. తొలుత గ్రామంలోని శివాలయంలో క్రికెటర్ రాయుడు పూజలు చేశారు. ఖాజీపేట ఆర్‌బికెలో రైతులతో మాట్లాడారు.

నేడు జగనన్న సురక్ష క్యాంపులు

తెనాలి: పట్టణంలో జగనన్న సురక్ష క్యాంపులు శనివారం నుంచి ప్రారంభిస్తున్నారు. తొలి రోజున గంగానమ్మపేట-2, భవనం వారి వీధి సచివాలయాల పరిధిలోని వారికి రజక చెరువు పార్కులో ఉదయం శిబిరం నిర్వహిస్తారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు నేతృత్వంలోని కమిటీ పర్యవేక్షణలో జరిగే శిబిరంలో వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, సంబంధిత కౌన్సిలర్లు పాల్గొంటారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శిస్తారు.

2న వంగవీటి చైతన్య రథసారథులు పుస్తకావిష్కరణ

తెనాలి: ప్రముఖ రాజకీయ నాయకుడు వంగవీటి మోహనరంగా జీవితంలోని సేవ, పోరాట సంఘటనలపై రూపొందించిన 'వంగవీటి చైతన్య రథసారథులు' పుస్తకాన్ని జులై 2న తెనాలిలో ఆవిష్కరించనున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. రచయిత తుర్లపాటి సురేష్ అక్షరీకరించిన పుస్తకాన్ని తెనాలికి చెందిన వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవాసమితి వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ ప్రచురించారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: బైక్, వాటర్ మోటార్ల చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఒకరు మైనర్. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. తెనాలి మండలం అంగలకుదురుకు చెందిన కొండముది అఖిల్ అలియాస్ టోని, సోడాగుడి జాన్‌పాల్, కోపల్లెకు చెందిన మైనర్ బాలుడు స్నేహితులు. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ వీరు తమ జల్సాలకు డబ్బుల కోసం చోరీ బాట పట్టారు. అంగలకుదురులో ఒక బైక్‌ను, అదే గ్రామంలోని జగనన్న కాలనీలో ఒక వాటర్ మోటార్‌ను, కోపల్లె గ్రామంలో మరో వాటర్ మోటారును చోరీ చేశారు. వీరిలో మైనర్‌బాలుడు విజయవాడ వన్‌టౌన్ పరిధిలో మరో బైక్‌ను చోరీ చేశాడు. అంగలకుదురు గ్రామంలో చోరీ చేసిన కేసులను నమోదు చేసి దర్యాప్తు చేసిన రూరల్ పోలీసులు నిందితులను గుర్తించి వారి కదలికలపై నిఘా ఉంచారు. ఆచూకీ గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

అంగలకుదురులో చోరీకి యత్నం

తెనాలిరూరల్: తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో ఓ దుండగుడు చోరీకి యత్నించాడు. విలువైన వస్తువులు లభించకపోవడం, పక్కింటి వారు కేకలు వేయడంతో పరారయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. అంగలకుదురులోని కాకర్ల రామ్మోహన్‌రావుకు చెందిన ఇంట్లో గురువారం అర్ధరాత్రి తర్వాత చోరీ యత్నం జరిగింది. రాత్రి సమయంలో ఓ దుండగుడు ఇంటి వద్దకు చేరుకుని చోరీకి విఫలయత్నం చేశాడు. మెయిన్‌గేటు తలుపు తొలగించి లోనికి ప్రవేశించిన దుండగుడు కప్ బోర్డులు, బీరువాలోని వస్తువులు చెల్లాచెదురు చేశాడు. అక్కడ విలువైన వస్తువులు ఏమీ దొరక్కపోవడంతో దేవుడి గదిలోకి వెళ్లి వెతుకుతుండగా అప్పుడే గుడికి వెళ్లి వచ్చిన పక్కింటి వారు శబ్దాలు విని కేకలు పెట్టారు. దీంతో కంగారు పడిన దుండగుడు అక్కడి నుంచి మెల్లగా జారుకున్నాడు. రామ్మోహన్‌రావు భార్య పినాకిని పక్కనే ఉన్న గదిలో నిద్రపోతుండగా ఇవేమీ ఆమె గమనించలేదు. ఉదయం ఆరు గంటలకు నిద్రలేచి వచ్చి చూసి సామాన్లు మొత్తం చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఎస్ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్ టీమ్‌కు సమాచారం ఇవ్వగా గుంటూరు నుంచి వచ్చిన బృందం ఆధారాలు సేకరించారు. చోరీకి ప్రయత్నం జరిగింది గానీ ఎటువంటి వస్తువులు పోలేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తాను పక్కనే ఉన్న గదిలో నిద్రపోయానని ఇదంతా గమనించలేదని ఇంటి యజమాని భార్య పినాకినీ తెలిపారు.

దోమల వృద్ధిని నివారించండి

కొల్లిపర: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే దోమల అభివృద్ధిని నివారించవచ్చని మున్నంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ వేముల ప్రియాంక అన్నారు. మలేరియా మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో మురుగు నిల్వ ఉన్న ప్రదేశాలల్లో ఎబేట్ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి వంగర బుజ్జిబాబు, హెల్త్ విజిటర్ డి.దవసం, సాయిబాబు, ఏఎన్ఎం పులి కుసుమ, ఆశ కార్యకర్త సుజాత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా

తెనాలిటౌన్: అన్ని రకాల అదనపు విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలని వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించరాదని డిమాండ్ చేస్తూ వామపక్ష నాయకులు శుక్రవారం విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీపీఎం తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ ధర్నాను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు హుస్సేన్‌వలి, సీపీఐ నాయకులు బాలస్వామి, సురేష్, రాజ్యలక్ష్మి, ఈశ్వరరావు, వెంకటసుబ్బయ్య, రవీంద్ర, దుర్గాప్రసాద్, భాస్కర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.